క్లుప్తంగా

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నకేష్‌రెడ్డి

కౌతాళం: గ్రామాల అభివృద్ధే తమ పార్టీ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నకేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో పంచాయతీ గ్రాంట్‌తో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి శనివారం పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌వాహిద్‌తో కలిసి భూమిపూజ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాల్లో ఎంతగానో అభివృద్ధి జరిగిందన్నారు. కిందిగేరిలోని మరో నాల్గు రోడ్లల్లో సిమెంటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే పాత కోళ్ల ఫారం వద్ద మరో మూడు చోట్ల నీళ్ల దిమ్మెల (ట్యాంకుల) ఏర్పాటుకు భూమిపూజ చేపట్టారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు పోరాడాలి



వాల్మీకి మహిళా ఉద్యోగినులను సన్మానిస్తున్న వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు బాల వెంకటేష్, ముక్కరన్న, నీలకంఠం నాయుడు, లక్ష్మీనారాయణ మాట్లాడారు. వాల్మీకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఎస్టీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలన్నారు. వెనుకబడిన వాల్మీకుల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా వాల్మీకి మహిళా ఉద్యోగులైన లెక్చరర్ సుశీల, పాఠశాల సహాయకులు భవానీ, ఉపాధ్యాయురాలు అనురాధ, కళ్యాణిదేవిలను సన్మానించారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు లక్ష్మికాంత్, నరసయ్య, సత్యన్న, రమేష్‌నాయుడు, సుధాకర్‌బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా పరిశీలన



పట్టణంలోని ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గాను శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. రంజాన్ సందర్భంగా సామూహిక ప్రా ర్థనలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నీరజ, ఏఈలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన రైతు మల్లేష్(60) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప.. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి సమాచారం అందించాడు. ఎమ్మెల్యే సహకారంతో మృతుని కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశాడు. యల్లప్ప మాట్లాడుతూ గతంలో పేదలు చనిపోతే వైఎస్సార్ భరోసా కింద బీమా వచ్చేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలో నాయకులు టీడీపీ సభ్యత్వం తీసుకుంటే చంద్రన్న బీమా వర్తిస్తుందని చాలమంది ప్రజలతో సభ్యత్వం కోసం డబ్బులు కూడా వసూలు చేశారన్నాడు. తీరా ఇప్పుడు చూస్తే సచివాలయం వెళ్లి ఇలా పేద రైతు చనిపోయాడు అని చెబితే చంద్రన్న బీమాలాంటిది ఏమీ లేదని చెప్పడం బాధాకరమన్నాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమప్పధని, లింగన్నగౌడ్ కడబూరి, మహాదేవ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం
- మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



మాట్లాడుతున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కంగాటి శ్రీదేవి, కార్పొరేటర్ శ్వేత

ఆదోని టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ కృష్ణమోహన్, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కర్నూలు కార్పొరేటర్ శ్వేత అన్నారు. టీజీఎల్ కాలనీలోని కురువల ఆరాధ్య దేవుడు భీరలింగేశ్వరస్వామి దేవాలయంలో శశికళ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి సమావేశాన్ని ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతోనే మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేశారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. పొదుపు సంఘాల మహిళలకు పావలా వడ్డీకే రుణాలు, రుణ మాఫీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు లేనిపోని వాగ్దానాలు చేసి మహిళలను అన్నివిధాలుగా మోసపుచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి

ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబునాయుడు వెంటనే అమలు చేయాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలను తొమ్మిది నెలలు అధికారంలోకి వచ్చినా అమలు చేయకపోవడం విచాకరమన్నారు.

మహిళలకు రక్షణ లేకుండా పోయింది

కూటమి ప్రభుత్వం మహిళలు, యువతులకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ కృష్ణమోహన్ ఆరోపించారు. మహిళలపై దాడులు, హత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. జగనన్న పాలనలో మహిళలు, యువతుల భద్రత, రక్షణ కోసం దిశ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల పేరు మీదనే ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, మహిళా విభాగం నాయకురాలు శ్రీలక్ష్మి, జిలేఖాబీ, పోలకల్ రేణుక, లక్ష్మిదేవి, నాయకులు తాయన్న, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

డాక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భీరప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో పాల్గొని వైద్యసేవలు అందించిన డాక్టర్లు, సిబ్బందిని సన్మానించారు. అలాగే మున్సిపాలిటీలోని మహిళా పారిశుద్ధ్య కార్మికులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

జగనన్న పాలనలోనే మహిళాభ్యున్నతి



మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మహిళాభ్యున్నతి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో పార్టీ కార్యాలయం ఆవరణలో బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్లు, పార్టీ మహిళా నాయకులు, స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, దివ్యకళలతో కలిసి నియోజకవర్గంలో ఆయా మహిళా ప్రజాప్రతినిధులను బుట్టా ఫౌండేషన్ తరపున సత్కరించారు. ఇన్‌చార్జ్ బుట్టారేణుక మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎంవైఎస్ జగన్ ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకే అందించారని గుర్తు చేశారు. డ్వాక్రా మహిళలకు, ఆసరా, అమ్మఒడి, సున్నా వడ్డీ పథకం, దిశచట్టం, మహిళా పోలీసుల నియామకం, ఉద్యోగాలతో పాటు పదవుల్లోను 50శాతం మహిళలకు కేటాయించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మహిళాభ్యున్నతి కోసం తమ బుట్టా ఫౌండేషన్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.



నందవరం మహిళా ప్రజాప్రతినిధులతో బుట్టా రేణుక



అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



ఆదోని సాళీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎంఈఐ సిసిరాదీప్తి



పెద్దకొత్తిలిలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీఫ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆట పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుల్లో ఉపాధ్యాయినులు



ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో కేక్‌కట్ చేస్తున్న మహిళా డాక్టర్లు



కేక్ కట్ చేస్తున్న గంజిహాళ్ల సర్పంచ్ లింగమ్మ

ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వసతి గృహాలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో, వివిధ కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను, మహిళా ఉద్యోగులను, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. పలు చోట్ల వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



మంత్రాలయంలో మాట్లాడుతున్న ఆర్డీటీ ఏటీఎల్ కృష్ణయ్య,





కౌతాళం పంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవం, కౌతాళం ప్రతిభ పాఠశాలలో వేడుకలు..



కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రతి ఇంటికి గుర్తింపు పత్రాలు అందించాలి

ఆదోని రూరల్: గ్రామాల్లో ఉన్న ప్రతి ఇంటికి ప్రభుత్వ గుర్తింపు పత్రాలను అందేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'స్వామిత్వ' కార్యక్రమంలో భాగంగా ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతి మండలానికి ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారి, నలుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లు చొప్పున మొత్తం పది మంది ఉంటారన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఇంటి యజమానిని గుర్తించి ఇంటి ముందు నిలబెట్టి ఫొటోలు తీసి వారికి ఇంటి హక్కు పత్రాలను అందేలా చూస్తారన్నారు. సమావేశంలో డివిజనల్ సర్వేయర్ వేణుసూర్య, ఆయా మండలాల ఈఓపీఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

నాటుసారా జోలికెళ్లొద్దు



కల్లుబావిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: నాటుసారా తయారీ, అమ్మకాల వల్ల జీవితాలు ఛిద్రమవుతాయని, నాటుసారా జోలికి వెళ్లరాదని ఆదోని ఎక్సైజ్ సీఐ ఎస్.కె.సైదుల్లా అన్నారు. శనివారం ఆదోని పట్టణ శివారులోని కల్లుబావిలో నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యాన్ని ప్రోత్సహించకుండా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై ప్రజలు తమకు సమాచారమివ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామానికి చెందిన బురిగేని రామాంజినేయు లు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. సమాచారం మేరకు శనివారం గ్రా మాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా మూగలదొడ్డి క్రాస్ రోడ్డు వద్ద బైక్‌పై మద్యం బాటిళ్లు తరలిస్తుండగా రామాంజినేయులు పట్టుబడిన ట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 480 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ రూ.40వేలు ఉంటుందన్నారు. బైకును సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కె. నాగరాజు, కిశోర్ కుమార్, కానిస్టేబుల్స్ మునిరంగడు ఉన్నారు.



పట్టుబడి మద్యంతో ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, సిబ్బంది

మహాధర్నాకు కదలిరండి

గోనెగండ్ల: కాటికాపరుల బతుకు సమస్య పరిష్కారానికి ఈనెల 11న విజయవాడలో జరిగే మహాధర్నాకు కదలిరావాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్మశానం విధులు నిర్వహించే బతుకులకు నేటికీ ఎలాంటి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సభ్యులు అసెంబ్లీలో చర్చించి కాటికాపరుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కాటికాపురులంతా 11న విజయవాడలో జరిగే మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్, కాటికాపరుల సంఘం నాయకులు మల్లికార్జున, శంకర్, తిమ్మప్ప, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కాటి కాపరుల సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్: శ్మశానంలో గుంతలు తీసే కాటి కాపరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కాటికాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.తిక్కప్ప, పట్టణ కార్యదర్శి వి.యువరాజు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తిక్కస్వామిదర్గా వెనుక ఉన్న శ్మశానవాటికలో కాటికాపరుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే కాటికాపరుల మహాధర్నాకు కాటికాపరులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాధర్నాకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు లక్ష్మన్న, శివరామ్, జయరాం, నాగేంద్ర, చిన్నకేశవ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో శనివారం గడ్డివామి దగ్ధమయ్యి దాదాపు రూ. లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. బాధితుడు ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్(వైఎస్సార్‌సీపీ), గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు అయనకు ఉన్న పశువులకు గ్రాసం కోసం ఎకరానికి రూ. 20వేలు చొప్పున 5ఎకరాల గడ్డి రూ. లక్ష పెట్టి కొనుగోలు చేశాడు. ఆ గడ్డిని తన ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిల్వ చేశాడు. శనివారం పిల్లలు ఆడుకుంటూ గడ్డికి నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. మంటలు ఎగిసిపడడంతో గమనించిన స్థానికులు, బాధిత కుటుంబం పక్కనున్న ట్యాంక్‌లోని నీటతో మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినా మంటలు అదుపు కాక గడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం ఆదుకుంటే తప్పా గడ్డి కొనలేనని, లేనిపక్షంలో పశువులను అమ్ముకోవాల్సిందేనని బాధితుడు వాపోయాడు.

నేటి నుంచి హోలీ ఉత్సవాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన అంబాభవానీ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి హోలీ ఉత్సవాలు జరగనున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటలకు రంగుల బిందెతో పురవీధులగుండా ఊరేగింపు, సోమవారం రాత్రి 12 గంటలకు మన్మథస్వామి సమేత శివపార్వతుల విగ్రహాల ప్రతిష్టాపన, 13వ తేదీ రాత్రి 10 నుంచి 12 గంటల వరకు మన్మథస్వామి రథోత్సవం, ఏనుగుపై ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే 14వ తేదీన పౌర్ణమి తెల్లవారుజామున రతీమన్మథ కళ్యాణ నాటకం, కామదహనం, హోళీ పండగ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలను అరికట్టండి

కౌతాళం: ఉపాధి పనుల్లో అవకతవకలను అరికట్టాలని బాపురం గ్రామ సర్పంచ్ శిల్పారెడ్డి, ఎంపీటీసీ సాభాగ్య డిమాండు చేశారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ వర్క్ ఐడీ ఒకచోట ఉంటే పనులు మరో చోట చేస్తున్నారన్నారు. చాపమ్మ అవ్వ ఆశ్రమం వద్ద నుంచి చెన్నబసవ పొలం వరకు 245120 నంబర్ గల వర్క్ ఐడీ దగ్గర పనులు చేయాల్సి ఉండగా అందకు విరుద్ధంగా మంజూరు కానీ 97–డి1, డి2 సర్వే నంబర్లలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉపాధి హామీ పనులు చేపట్టారని తెలిపారు. ఈ సర్వే నెంబర్లో 1995లో అప్పటి కలెక్టర్ దళితులకు 82 ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగిందని, దళితులు కొంతకాలంగా నివాసం ఉండేవారన్నారు. ఆ తర్వాత కోర్టులో కేసు నడుస్తుండడంతో అక్కడ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కోర్టులో ఉన్న స్థలాల్లో ఉపాధి పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కోర్టులో ఉన్న భూవివాదాలను అడ్డదారుల్లో పనులు చేయించడం సమంజసమం కాదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురునాథ్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయపాల్ పలువురు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 430 కేసుల పరిష్కారం

ఆదోని రూరల్: పట్టణంలోని రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్‌అదాలత్‌లో 430 కేసులు పరిష్కారమైనట్లు రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ తెలిపారు. వీటిలో ఎక్సైజ్ కేసులు 16, ఐపీసీ కేసులు 33, ఈపీలు 23, మనీ సూట్‌లు 03. భూవివాదాలు 08, ఇతర కేసులు కలిపి మొత్తం 430 కేసులు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎస్ఎండీ ఇస్మాయిల్, లోకేష్‌కుమార్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళలకు చదువు ఎంతో అవసరం

మహిళలకు చదువు ఎంతో అవసరమని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ పిలుపునిచ్చారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో లోక్‌అదాలత్ కార్యక్రమానికి ముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మహిళలు పిల్లలను కూడా బాగా చదివించుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి జి.అర్చన, మొదటి అదనపు సివిల్ జడ్జి ఎం.లీలసాయి సుభాష్, రెండో అదనపు సివిల్ జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి న్యాయవాదులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జడ్జి పి.జె.సుధ

ఉరుకుందలో రుద్ర హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వద్ద శనివారం రుద్ర హోమ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు భక్తుల మధ్య ఘనంగా చేపట్టారు. అరుద్ర నక్షత్రంలో రుద్రహోమం నిర్వహించడం వల్లే శుభాలు జరుగుతాయన్నారు. హోమంలో పాల్గొనే జంటలకు దేవాలయం వారు రూ.1500 రుసుం నిర్ణయించడంతో చాల మంది భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో పూజలు చేసి, హోమం కార్యక్రమంలో పాల్గొని భక్తిని చాటుకున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాలను దేవాలయం వద్ద నిరంతరంగా కొనసాగిస్తామని వారు తెలిపారు. నవగ్రహ మండపారాధన, రుద్ర కలశ ఆవాహన, రుద్రహోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాలను శాస్త్రోపేతంగా చేపట్టారు.



హోమ పూజల్లో అర్చకులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆదోని అర్బన్: పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన వరలక్ష్మి(44) అనే వివాహిత గణేకల్ సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడిన ప్రమాదంలో మృతి చెందింది. పెద్దతుంబళం పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కార్వన్‌పేటకు చెందిన భార్యాభర్తలు వరలక్ష్మి, లోకేష్ బైకుపై ఉరుకుంద వెళ్లి ఈరన్నస్వామి వారిని దర్శించుకుని, తిరిగి ఆదోనికి వస్తుండగా గణేకల్ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడ్డారు. వరలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా.. వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రజక వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శాంతిమల్లప్ప చెరువు వద్ద తాయమ్మవ్వ దేవాలయంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆదోని నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశ్వకర్మ కౌశల్య యోజనకు 2023వ సంవత్సరంలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగా ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిందన్నారు. 2024 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల మందికి పైగా లబ్ధిదారులు శిక్షణ తీసుకోవడం జరిగిందన్నారు. వీరికి రోజువారీ వేతనం రూ.500 ఇస్తామని చెప్పారన్నారు. అయితే ఐదు నెలలు కావొస్తున్నా ఏ ఒక్క లబ్ధిదారుడికి శిక్షణ పొందిన సందర్భంగా వేతనం ఇవ్వలేదన్నారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్, జిల్లా అధ్యక్షులు సి.ముక్కన్న, జిల్లా కమిటీ సభ్యులు సి.ఉరుకుందు, రజక ఉద్యోగుల సంఘం నాయకులు నాగరాజు, గోవిందప్ప, సీనియర్ నాయకులు హుసేన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్